సెంటిమెంట్ కొనసాగేనా?

అచ్చంపేటలో గెలిచిన పార్టీదే అధికారం

- 12సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే ప్రభుత్వ ఏర్పాటు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు

అచ్చంపేట: అచ్చంపేట నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలుపెట్టాయి. స్థానికంగా ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది. అచ్చంపేట ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

1962లో నియోజకవర్గం ఏర్పాటు..

1307 ఫసలీలో అమ్రాబాద్ తాలూకాగా ఉండేది. 1322 ఫసలీలో అచ్చంపేటకు మార్చారు. 1952, 1957 అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ్య నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉన్నది. 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.నాగన్న ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గ పునర్విభజనలోనూ ఎస్సీలకే రిజర్వు అయింది. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు మండలాలు పూర్తిగా అచ్చంపేట సెగ్మెంట్‌లోకి వచ్చి చేరాయి. పదర, చారకొండ కొత్త మండలాల ఏర్పాటుతో మొత్తం 8 మండలాలుగా నియోజకవర్గం ఉంది. 1962 నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే.. 12సార్లు ఇక్కడ గెలిచిన పార్టీయే అధికారం చేపట్టింది. 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తే.. ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు గెలుపొందడంతో చరిత్రకు గండి పడింది. 2014, 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీకి ఇక్కడ పట్టం కట్టడంతో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఇంతవరకు హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యేలు లేకపోవడం విశేషం.

వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యం..

అచ్చంపేట ఓటర్లు వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యమిస్తున్నారు. 1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకే ఓటర్లు పట్టం కట్టారు.6సార్లు కాంగ్రెస్, 5సార్లు టీడీపీ, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ విజయం సాధించాయి. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మహేంద్రనాథ్ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.



అచ్చంపేట పట్టణ వ్యూ

అత్యధిక.. అత్యల్ప మెజార్టీ



ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 46,181 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా 2,609 ఓట్ల మెజార్టీ నమోదైంది. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన పి.రాములు 46,181 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డి.కిరణ్‌కుమార్ 2,609 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.


1962 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1962	కె.నాగన్న	కాంగ్రెస్	5,433
1967	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	12,502
1972	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	17,686
1978	ఆర్ఎం మనోహర్	కాంగ్రెస్.ఐ	9,310
1983	పి.మహేంద్రనాథ్	టీడీపీ	10,316
1985	మహేంద్రనాథ్	టీడీపీ	34,445
1989	డి.కిరణ్‌కుమార్	కాంగ్రెస్	2,609
1994	పి.రాములు	టీడీపీ	46,181
1999	పి.రాములు	టీడీపీ	12,346
2004	వంశీకృష్ణ	కాంగ్రెస్	20,665
2009	పి.రాములు	టీడీపీ	5,101
2014	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	11,821
2018	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	9,556

ఓటర్ల వివరాలు..

పురుషులు:	మహిళలు:	ఇతరులు:	సర్వీస్ ఓటర్లు:	మొత్తం:
1,17,124	1,16,439	2	173	2,33,738

పోలింగ్ కేంద్రాలు: 265



2018 ఎన్నికల్లో..

గువ్వల బాలరాజు (టీఆర్ఎస్): 87,841	చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్): 78,285
మేడిపల్లి మల్లేష్ (బీజేపీ): 3,196	నోటా: 2,403

భౌగోళికంగా..

అచ్చంపేట నియోజకవర్గం జిల్లాలోనే చాలా పెద్దది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2166.37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అరుదైన వన్య ప్రాణులు, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి.

బీసీలు, ఎస్సీలే కీలకం..

నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కులాల వారీగా పరిశీలిస్తే.. 2,33,565 మంది ఓటర్లలో ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీలు 60వేలు, బీసీలు లక్ష 15వేలు, ఎస్టీలు 32వేలు, రెడ్డి, వైశ్యులు 20వేలు, ముస్లిం, మైనార్టీలు 7వేల మంది ఓటర్లు ఉన్నారు.

స్థానికేతరులకే పట్టం..



పుట్టపాగ మహేంద్రనాథ్

అచ్చంపేట నియోజకవర్గానికి మరో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఎక్కువగా స్థానికేతరులే ఉన్నారు. మొత్తం 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. 10సార్లు స్థానికేతరులు ఎన్నిక కావడం విశేషం. 1994, 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే స్థానికులైన పి.రాములు, చిక్కుడు వంశీకృష్ణలు ఎన్నికయ్యారు. 1962లో కె.నాగయ్య, 1978లో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎం మనోహర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972, 1983, 1985 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ ఎన్నిక కాగా, 1989లో నాగర్‌కర్నూల్ మండలం శాయిన్‌పేటకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో అచ్చంపేట సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే పి.రాములు స్వగ్రామమైన గుండూరు.. కల్వకుర్తి నియోజకవర్గంలోకి చేరడంతో ఆయన స్థానికేతరుడు అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన గువ్వల బాలరాజుది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్ గ్రామం.

2009లో అప్పాపూర్‌లో పోలింగ్ బూత్..

నల్లమల అభయారణ్యంలోని అప్పాపూర్ చెంచుపెంటలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో 180/182ను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో 12 చెంచుపెంటలకు చెందిన గిరిజనులు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. సోమవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ ఖలీద్ ఆధ్వర్యంలోని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పరమేష్‌గౌడు, రేఖరెడ్డి, శ్రీనివాసులు, జగదీష్, ఐటీబీపీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

గొర్రెలకు, మేకలకు టీకాలు



అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ప్రభుత్వం చేపట్టిన టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మండలంలోని బింగుదొడ్డి, ఏక్లాస్‌పురం గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. మొత్తం 3,366 గొర్రెలకు, 93 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి పేర్కొన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను వేయించాలని కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



గట్టు: మండలంలోని చిన్నోనిపల్లెలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ప్రతి మనిషి త్రైత సిద్ధాంత భగవద్గీతను చదివి, గురు పౌర్ణమి రోజున శ్రీ కృష్ణ పరమాత్మనే గురువుగా పూజించాలని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ పాల్గొన్నారు.

ఆశాలకు అవగాహన



అలంపూర్ రూరల్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మానసిక వైద్య నిపుణులు ప్రదీప్ హాజరై మాట్లాడారు. మానసిక రోగి లక్షణాలు ఎలా ఉంటాయో, వాటిని ఎలా గుర్తించాలో ఈ సందర్భంగా సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి మృతి



బసన్ గౌడ్ (ఫైల్)

ధరూరు: అనారోగ్య సమస్యతో ఓ రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ధరూరుకు చెందిన బసన్‌గౌడ్ (85) గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించి ఇంటి వద్దే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పట్లో ధరూరు ఎంఆర్‌ఓ కార్యాలయంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్‌తో పాటు ర్యాలంపాడు గ్రామ వీఆర్‌ఓగా పని చేసి రిటైర్ అయ్యారు. ఆయనకు భార్య గిరిజమ్మతో పాటు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులను మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు డీఆర్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచు పద్మమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

ఐదు నెలలుగా జీతాల్లేవు

మానవపాడు: కస్తూర్బా పాఠశాలలో సమయానికి జీతాలు అందక కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం మండలంలోని కేజీవీబీ పాఠశాలలో జూనియర్ అకౌంటెంట్ పద్మకు జూన్ నుంచి జీతాలు అందలేదని తెలిపారు. అధికారులు స్పందించి జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై ఎస్ఓను అనురాధ వివరణ కోరగా, పనితీరు నెమ్మదిగా ఉన్నందుకు ఉన్నతాధికారులు నిలిపేశారని తెలిపారు.

జూరాల కట్టపై ముళ్ల పొదలు

- ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు



జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్ రోడ్డు మార్గంలో రోడ్డుకు అడ్డంగా ముళ్లపొదలు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రోడ్డ మార్గంలోని రిజర్వాయర్ కట్టపై రోడ్డుకు అడ్డంగా పెరిగిన ముళ్ల చెట్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రిజర్వాయర్ వైపు ఉన్న సేఫ్టీ వాల్‌ను దాటుకుని రోడ్డుకు అడ్డంగా ముళ్లపొదలు ఉన్నా పీజేపీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రాజెక్టు కట్టపై ఎలాంటి చెట్లు ఉండ కూడదు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. చెట్ల వల్ల చెట్ల వేర్లు కట్ట లోతుకు వరకు వెళ్లి లీకేజీలకు కారమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే చెట్ల వేర్ల కారణంగానే ర్యాలంపాడు రిజర్వాయర్ కట్టకు లీకేజీలు ఏర్పడి 4టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లో మరమ్మతులు లేని కారణంగా కేవలం 2టీఎంసీల నీరు నింపుతూ కాలం వెల్లదీస్తున్న విషయం తెలిసిందే. చెట్ల తొలగింపు పని చిన్నదే అయినా.. దానిని నిర్లక్ష్యం చేస్తే పెద్ద ముప్పే పొంచి ఉన్నట్లు కనిపిస్తోంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ముళ్ల పదలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు ప్రాజెక్టుకు ముప్పు వాటిళ్ల కుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోగులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



మల్దకల్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపారాణి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. సోమవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో బీపీ, షుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి మందులు అందే విధంగా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వారి వివరాలను రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



అయిజ: ఎక్సైజ్ పోలీస్ బృందం ఆధ్వర్యంలో సోమవారం బెల్ట్ షాప్‌పై దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ గోపాల్ వివరాల ప్రకారం.. మండలంలోని కుటుకనూరులో అక్రమ మద్యం విక్రయ కేంద్రంపై దాడులు నిర్వహించి 15 బాటిళ్లు ఎంసీ విస్కీ స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చాంద్ సాహెబ్, బోయ రామన్నలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్, రాజేందర్, కానిస్టేబుళ్లు రాజు, షబ్బీర్ పాల్గొన్నారు.



అలంపూర్: జాతీయ రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ బానోతు పటేల్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం డీటీఎఫ్ బృందం, ఎస్‌హెచ్‌ఓ బృందం రూట్ వాచ్ నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఆటోను తనిఖీ చేయగా అందులో 25.92 లీటర్ల మద్యం గుర్తించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న కర్నూల్‌కు చెందిన షేక్ అల్తాఫ్ బాషాపై కేసు నమోదు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.28 వేలు ఉంటుందని తెలిపారు. తనిఖీలో ఎస్ఐ మోగులప్ప ఉన్నారు.

విశ్వరూప మహాసభలకు తరలిరండి



మానవపాడు: ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ జయరాజ్ మాదిగ తెలిపారు. సోమవారం సభకు సంబంధించిన కరపత్రాలను కొర్విపాడులో విడుదల చేశారు. 29 సంవత్సరాల పోరాటం చివరి దశలో ఉందని, జిల్లాలో ఉన్న వేలాది మాదిగ ఉపకులాలు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, నరసింహులు, సోమన్న, శ్రీకాంత్, చక్రవర్తి, రాఘవేంద్ర, వెంకట్రాములు, వేణు, వీరేందర్ భారత్ పాల్గొన్నారు.

అలంపూర్: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దామని జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాదిగ, సీనియర్ నాయకులు మద్దిలేటి మాదిగ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన మాదిగల విశ్వరూప మహాసభ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ భారీ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ భవిష్యత్ కోసం ఊరు వాడ ఏకం చేసి సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరాజు మాదిగ, శ్రీను మాదిగ. జోసేఫ్ మాదిగ, రాజు మాదిగ ఉన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



ధరూర్ నుంచి గద్వాలకు బయలుదేరిన టీఆర్ఎస్ నాయకులు

గట్టు: గద్వాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. గట్టు, మాచర్ల, బల్గెర, ఇందువాసి, చాగదోన గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక వాహనాల్లో గద్వాల సభకు తరలి వెళ్లారు.

ధరూరు: కేసీఆర్ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

కేటీదొడ్డి: జోగుళాంబ గద్వాల జిల్లాలోని నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ సభకు మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు భారీగా వాహనాలు, బైకులపై తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు గోవిందు, హనుమంతు, నసీర్, యుగంధర్, నారాయణ, కిష్టప్ప, ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు సురక్షితం



క్యాతూర్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్రవంతి

అలంపూర రూరల్: గర్భిణులకు అవగాహన కల్పించి ప్రతి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేయించుకునేలా చూడాలని జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ స్రవంతి అన్నారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో సోమవారం ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెట్టెంపాడులో పడకేసిన పారిశుద్ధ్యం



నెట్టెంపాడులోని ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు నిలిచిన మురుగు

ధరూరు: గ్రామాల్లో నేటికీ అంతర్గత రోడ్లకు, మురుగు కాల్వలకు నోచుకోవడం లేదు. మండలంలోని నెట్టెంపాడులోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఇండ్లు, గుడిసెల ముందే మురుగు నీరు నిలిచినా పట్టించుకునే నాథులు కరువయ్యారు. దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల దోమల బెడద తీవ్రంగా పెరిగిందని, తద్వారా మలేరియా, విష జ్వరాలు సోకి ఆస్పత్రుల పాలయ్యామని తెలిపారు. అధికారులకు ఈ విషయం తెలిపినా పట్టించుకోవడం లేదని, మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఉక్కపోత

ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఫ్యాన్ లేక ఉక్కపోస్తున్నది. చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఎండలు పెరగడంతో చిన్నారులకు ఫ్యాన్ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా విద్యుత్ ఏర్పాటు చేసి ఫ్యాన్‌ను అమర్చాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిరుపయోగంగా డ్వాక్రా భవనం

మల్దకల్: మండలంలోని ఎల్కూరులో డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 14ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు ఈ భవనాన్ని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. డ్వాక్రా భవనం చుట్టూ కంపచెట్లతో విషపురుగులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా డ్వాక్రా భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి డ్వాక్రా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించండి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి కొర్విపాడు స్టేజీ వరకు వెళ్లే దారి గుంతల మయంగా మారింది. రైతులు, ప్రజలు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్నికల ప్రచారంలో పార్టీల నాయకులు

సాక్షి నెట్‌వర్క్: అలంపూర్ నియోజకవర్గంలో ఏనుగు గుర్తుకు ఓటువేసి చెన్న కేశవరావును గెలిపించాలని ఆయన సతీమణి సుదక్షణ ఇంటింటికి తిరిగి ప్రజలను కోరారు. మానవపాడు మండలంలోని జల్లాపురం, బోరెల్లి గ్రామాల్లో, ర్యాలంపాడ్, సుల్తాన్‌పూర్, జిల్లెలపాడ్‌లో బీఎస్పీ అభ్యర్థి ఎంసీ కేశవరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ అభ్యర్థి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థి విజయుడు బీచుపల్లిలో పూజలు చేసి ప్రచారం చేశాడు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

బాలుడు అదృశ్యం



మనోజ్‌బాబు

అలంపూర్: బాలుడు అదృశ్యమైన ఘటన సోమవారం అలంపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతమార్కెట్‌కు చెందిన రెడ్డిపోగు మద్దమ్మకు కర్నూల్‌కు చెందిన నర్సింహులుతో వివాహమైంది. వారికి కుమారుడు రెడ్డిపోగు మనోజ్‌బాబు ఉన్నాడు. బాబు పుట్టిన తర్వాత భర్త ఆమె వదిలి వెళ్లాడు. దీంతో ఆమె బాబుతో కలిసి అలంపూర్ పట్టణంలోని సంతమార్కెట్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. రెడ్డిపోగు మనోజ్‌బాబు(13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. 5వ తేదీన మధ్యాహ్నం తల్లికొడుకు కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత ఆమె పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగా బాబు కనిపించలేదు. అక్కడ ఉన్న వారిని విచారించగా బాబు మధ్యాహ్నం బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్ వద్ద కనిపించినట్లు చెప్పారు. ఆ పరిసర ప్రాంతాల్లో వెతికి, బంధువులకు ఫోన్ చేసి విచారించినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.